

కామారెడ్డి కలెక్టర్‌గా ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డిటౌన్, జూన్15: కామారెడ్డి జిల్లా కలెక్టర్‌గా ఆశిష్ సంగ్వాన్‌ను నియమిస్తూ రాష్ట్రప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ఇక్కడ పనిచేస్తున్న జితేష్ వి.పాటిల్‌ను భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్‌గా బదిలీచేశారు. ప్రస్తుతం నిర్మల్ జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న సంగ్వాన్ స్వస్థలం హర్యానాలోని భివాని. అమెరికాలోని జార్జియా టెక్ యూనివర్సిటిలో కంప్యూటర్‌సైన్స్‌లో మాస్టర్ డిగ్రీచేసిన అనంతరం 2015లో సివిల్‌లో 12వ ర్యాంక్ సాధించారు. అక్టోబర్ 2023 నుంచి నిర్మల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న సంగ్వాన్ ఇప్పుడు కామారెడ్డికి రానున్నారు.

ఆంధ్రజ్యోతి ఫోకస్







గాయపడ్డ అటవీ శాఖ అధికారులు (ఫైల్ ఫొటోలు)

నిత్యం.. ప్రాణ సంకటం!

- జిల్లాలో తరచూ అటవీ శాఖ అధికారులపై దాడులు
- గతంలో సంచలనం రేపిన ఎఫ్‌ఆర్‌వో గంగయ్య హత్య
- అటవీ ప్రాంతంలోకి వెళ్లాలంటేనే జంకుతున్న అధికారులు
- ప్రాణ రక్షణ కోసం ఆయుధాలు ఇవ్వాలని డిమాండ్

అధికారుల నిరసన

- రక్షణ కల్పించాలని ప్రభుత్వానికి వినతి

మంచిప్ప అటవీ ప్రాంతంలో అటవీశాఖ అధికారులపై జరిగిన దాడిని అటవీశాఖ అధికారుల సంఘం తీవ్రంగా ఖండించింది. శనివారం అటవీశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇన్‌చార్జి ఎఫ్‌డీవో సుధాకర్‌రావు మాట్లాడుతూ ఫారెస్టు అధికారులపై దాడులు సరికాదని అన్నారు. అనంతరం ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ల ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు రవిమోహన్‌భట్ మాట్లాడుతూ అడవులను రక్షిస్తున్న తమ ప్రాణాలను తీస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. అటవీ ప్రాంతంలోకి ఒక్కరే వెళ్లాలంటే భయపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫారెస్టు అధికారులపై దాడులు చేస్తే కఠిన చర్యలు తీసుకునేలా ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వారిపై పీడీయాక్ట్ నమోదు చేయాలని, మూకుమ్మడిగా అటవీశాఖ అధికారులపై దాడులకు పాల్పడుతూ కొందరు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని జిల్లా ఫారెస్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సుధాకర్ అన్నారు. ఫారెస్టు అధికారులపై దాడిచేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అటవీశాఖ అధికారులపై దాడి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అన్నారు. అనంతరం అడిషనల్ సీపీ కోటేశ్వర్‌రావు, అడిషనల్ కలెక్టర్ కిరణ్‌కుమార్‌లకు ఫారెస్టు ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫారెస్టు రేంజ్ ఆఫీసర్లు పద్మారావు, వినయ్‌కుమార్, రాధిక, అధికారులు ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న అటవీ శాఖ అధికారులు

సుభాష్‌నగర్, జూన్15: అటవీ ప్రాంతాన్ని రక్షించడం అటవీశాఖ అధికారులకు ప్రాణాల మీదకు తీసుకువస్తోంది. అటవి భూఉలను రక్షిస్తున్న అధికారులపై కొందరు దాడులకు యత్నిస్తున్నారు. గత కొంతకాలంగా జిల్లాలో అటవీశాఖ అధికారులపై దాడులు మామూలైపోయాయి. జిల్లాలోని కొన్ని మండలాల్లోని అటవీ ప్రాంతాల్లోకి వెళ్లాలంటే ఫారెస్టు అధికారులు జంకుతున్నారు. కలప స్మగ్లింగ్ ఒకవైపు, మరోవైపు అటవీభూమి ఆక్రమణతో అటవీశాఖ అధికారులు తలామునకలవుతున్నారు. నిజామాబాద్ జిల్లాలో పోడుభూముల సమస్య గత కొన్నేళ్లుగా అలానే ఉంది. ప్రభుత్వాలు మారినా ఆ సమస్యకు పరిష్కారం చూడం లేదు. అంతేకాకుండా భూముల విలువ పెరగడంతో ఉచితంగా వస్తున్న అటవీ భూములను ఆక్రమించి డబ్బులు సంపాదించాలనే దురుద్దేశ్యంతో అటవీభూమిని కొందరు చదునుచేస్తున్నారు. దీన్ని అడ్డుకుంటున్న అటవీశాఖ అధికారులపై తరచూ దాడులకు తెగబడుతున్నారు. కొందరు అటవీశాఖ అధికారులను బెదిరింపులకు పాల్పడి అటువైపు రాకుండా చేస్తున్నారు. అధికారులపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని అటవీశాఖ అధికారుల సంఘం నాయకులు ఆందోళనకు గురవుతున్నారు. అటవీభూములను రక్షిస్తున్న తమ ప్రాణాలకు రక్షణ లేకపోతే ఎలా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఏళ్లతరబడి అటవీభూమి అన్యాక్రాంతం

జిల్లాలో గత కొన్నేళ్లుగా పోడు ఎక్కువగా అటవీ ప్రాంతంలో జరుగుతోంది. రెండుదశాబ్దాలుగా ముందు నుంచే భూముల విలువ పెరగడం ఎక్కువ మంది వ్యవసాయంపై దృష్టిపెట్టడంతో అటవీ భూములు ఎక్కువగా అన్యాక్రాంతమతున్నాయి. జిల్లాలోని పలు మండలాల పరిధిలో ఉన్న అటవీ భూములకు పోడు పట్టాలు ఉమ్మడి రాష్ట్రం 2005లో ఇవ్వడంతో ఈ ఆక్రమణ ఎక్కువైంది. రాష్ట్రంలోనే సరాసరి అడవుల విస్తీర్ణం తక్కువగా ఉన్న ఈ జిల్లాలో పోడుతో ఎక్కువ అటవీ భూములు ఆక్రమణకు గురయ్యాయి. యూపీఏ హయాంలో అటవీ హక్కుల చట్టం కింద వేలాది ఎకరాలను గిరిజనులకు ఇతరవర్గాలకు హక్కులు కల్పించారు. అప్పటి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వర్ని, మోస్రా, చందూర్, మోపాల్, నిజామాబాద్ రూరల్, మాక్లూర్, నవీపేట, ఎడపల్లి, రుద్రూర్, సిరికొండ, ధర్పల్లి, డిచ్‌పల్లి, భీంగల్, కమ్మర్‌పల్లి, మోర్తాడ్, జక్రాన్‌పల్లి మండలాల పరిధిలో ఈ ఆక్రమణ ఎక్కువగా జరిగాయి. గతంలో పోడుభూములను అడ్డుకున్న ఓ రేంజ్ అధికారిపై కూడా దాడి చేయడంతో చనిపోయారు. నక్సల్స్ ఉన్న సమయంలో అటవీశాఖ అధికారులకు ఆయుధాలు ఉన్నా ఎక్కువగా వారు ఎత్తుకెళ్లడంతో ఆయుధాలను తిరిగి తీసుకున్నారు. ఆ తర్వాత అటవీ శాఖ అధికారులు ఎన్ని విజ్ఞప్తులు చేసినా ప్రభుత్వాలు ఇవ్వలేదు. గత కొన్నేళ్లుగా పోడు పేరుపై పట్టాలు ఇవ్వడం గత ప్రభుత్వం కూడా ఎన్నికలకు ముందు కొంతమందికి హక్కులు కల్పించడంతో అటవీ ప్రాంతంలోని తండావాసుల్లో ఆశలు పెరిగాయి. కొన్నేళ్లు సాగుచేస్తే పట్టాలు వస్తుండటంతో ఎక్కువ మొత్తంలో ఈ ఆక్రమణకు పాల్పడుతున్నారు. అటవీ భూములను కాపాడటంతోపాటు అన్యాక్రాంతం కాకుండా అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి పెడితే అధికారులపై దాడులు ఆగే అవకాశం ఉంది.

రక్షణ కల్పించాలి



- సుధాకర్, అటవీశాఖ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు

ఫారెస్టు అధికారులకు రక్షణ కల్పించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. అధికారులకు ఆయుధాలు ఇవ్వాలి. సమస్యాత్మక అటవీ ప్రాంతంలోకి వెళ్లేటప్పుడు పోలీస్ ప్రొటెక్షన్ కల్పించాలి. ఫారెస్టు అధికారులపై దాడి చేసిన వారిని కఠిన చర్యలు తీసుకోవాలి.

సంచలనం రేపిన ఎఫ్‌ఆర్‌వో హత్య

ఇందల్వాయి ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ గంగయ్య అటవీ భూమిని ఆక్రమించారని సమాచారం అందుకొని వెళ్లిన గంగయ్యను స్థానికులు గుమ్మిగూడి వెంబడించి దారుణంగా హత్యచేశారు. ఈఘటన 2013 ఆగస్టు 13న రాష్ట్రంలో సంచలనం సృష్టించింది. అప్పటినుంచి అటువైపు వెళ్లాలంటే ఫారెస్టు అధికారులు భయాందోళనకు గురవుతున్నారు. జిల్లాలోని సిరికొండ, కమ్మర్‌పల్లి, భీంగల్, ఇందల్వాయి, వర్ని తదితర మండలాల్లో ఫారెస్టు అధికారులు తమ పనిని చేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యోగులు తమప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ఉద్యోగాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంగయ్య హత్య అనంతరం 2022లో భద్రాద్రి కొత్తగూడెంలో గొత్తికోయల చేతిలో మరో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ శ్రీనివాస్‌రావు హత్యకు గురయ్యారు. ఈ రెండు ఘటనలు అటవీశాఖ అధికారులకు ప్రాణభయం చూపించింది. దీంతో అటవీశాఖ అధికారులు తమకు రక్షణ కల్పించాలని వేడుకుంటున్నారు.

ఆయుధాలు ఇవ్వాలని డిమాండ్

కలప స్మగ్లింగ్, అటవీ ఆక్రమణ రాత్రుళ్లు జరుగుతున్న నేపథ్యంలో రాత్రివేళల్లో ఒక్కరే పెట్రోలింగ్‌కు వెళ్లాల్సి వస్తోందని ఎలాంటి ఆయుధాలు లేక రాత్రుళ్లు ఉద్యోగాలు చేయడం కత్తిమీది సాములా మారిందని అటవీశాఖ అధికారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దీనికి తోడు ఫారెస్టు అధికారుల సంఖ్య తక్కువగా ఉందని, అధికారులను భర్తీ చేయాలని కోరుతున్నారు. అధికారులపై దాడుల నేపథ్యంలో అటవీశాఖ అధికారులకు ఆయుధాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. తాము ఖాకీ బట్టలు వేసుకొని పోలీసుల మాదిరిగా అటవీ రక్షణ కోసం అడవుల్లో తిరుగుతున్నామని ఆయుధాలను ఇస్తే ప్రాణ రక్షణ ఉంటుందని విన్నవిస్తున్నారు. ఫారెస్టు అధికారుల హత్య నేపథ్యంలో ఆయుధాలు ఇస్తేనే తమ ప్రాణాలకు ముప్పు ఉండదని పేర్కొంటున్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించడం లేదని చెప్తున్నారు.



- జాన్కంపేట్‌గ్రామం వద్ద రోడ్డుకు సమానంగా ఉన్న శిథిలావస్థకు చేరిన కల్వర్టు

కల్వర్టులు ప్రమాదాలకు నిలయాలు!

- శిథిల కల్వర్టులతో తరుచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు

వేల్పూర్, జూన్15: కల్వర్టులు ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి. మండలంలోని పలు గ్రామాల మీదుగా ఉన్న ప్రధాన రహదారుల పక్కన నిర్మించిన కల్వర్టులు ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. దీంతో ఈ కల్వర్టుల వద్ద తరచుగా ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ కల్వర్టుల ఎత్తు పెంచడం, మరమ్మత్తులు చేపట్టడం వంటి పనులు చేయడంలో సంబంధిత అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడంలేదని మండల ప్రజలు ఆగ్రహిస్తున్నారు. వర్షాపు నీరు వ్యవసాయ తోట నుంచి వచ్చే పంట కాలువ నీరు రోడ్డును దాటి వెళ్ళేందుకు వీలుగా వివిధ రహదారులకు ఇరువైపులా ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు కల్వర్టులను నిర్మించారు. కానీ ఆ కల్వర్టులు ప్రస్తుతం రోడ్డుకు సమానంగా ఉండడంతో వాహనదారులు తరచు ప్రమాదాలకు గురవుతూ ప్రాణనష్టం జరిగిన సంఘటనలు ఉన్నాయి. జాన్కంపేట్ నుంచి భీమ్‌గల్‌కు వెళ్లే రోడ్డులో ఉన్న చాలా వరకు కల్వర్టులు ప్రమాదకరంగా ఉన్నాయి. పచ్చలనడ్కుడ గ్రామం మొదట్లో వాటర్ ట్యాంక్ వద్ద జాన్కంపేట్ గ్రామశివారులో సమీపంలో ఉన్న ఉన్న కల్వర్టులు శిథిలావస్థకు చేరుకొని రోడ్డు ఎత్తులో సమానంగా ఉండడంతో రోడ్డుకు సమానంగా కల్వర్టు ఉండడం వల్ల వాహనదారులు వాటిని గమనించకపోవడంతో వాటిని ఢీకొని ప్రమాదాలకు గురైన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. పలు గ్రామాల మీదుగా వెళ్లే రోడ్లకు గత కొన్నేళ్ల క్రితం నిర్మించిన కల్వర్టులు కూడా శిథిలావస్థకు చేరుకొని కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుకు ఎత్తుకు సమానంగా మారిన కల్వర్టులను వాహనదారులకు కనిపించే విధంగా సరైన ఎత్తులో నిర్మించాలని, అలాగే శిథిలావస్థలో ఉన్న కల్వర్టుల స్థానంలో కొత్తగా కల్వర్టులు నిర్మించి రోడ్డు ప్రమాదాలు నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.



పచ్చలనడ్కుడ గ్రామం వద్ద రోడ్డుకు సమానంగా ఉన్న శిథిలావస్థకు చేరిన కల్వర్టు

కల్వర్టుల వద్ద సూచికలు ఏర్పాటు చేయాలి

- సోమ మహిపాల్‌రెడ్డి, జాన్కంపేట్

గ్రామాల మీదుగా వెళ్లే వాహనదారులకు ఇరువైపులా కల్వర్టులు కనిపించేలా కొత్తగా కల్వర్టులు నిర్మించాలి. కల్వర్టుల వద్ద సూచికలు ఏర్పాటు చేయాలి. గతంలో నిర్మించిన కాల్వర్టులు ప్రస్తుతం శిథిలావస్థకు చేరి కూలేలా ఉన్నాయి. వాటి స్థానంలో కొత్త వాటిని నిర్మించాలి. రోడ్డుకు సమానఎత్తులో కల్వర్టులు ఉండడంతో వాటిని గమనించని వాహనదారులు కల్వర్టుకు ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి వెంటనే చర్యలు చేపట్టాలి.







నవీపేట సంతలో మేకపోతులకు భలే డిమాండ్!

- బక్రీద్ పండుగను పురస్కరించుకుని భారీగా జీవాల క్రయవిక్రయాలు
- ధర ఎక్కువ పలికినప్పటికీ జోరుగా సాగిన కొనుగోళ్లు
- ఏకంగా 10 కోట్ల రూపాయల వరకు లావాదేవీలు

నవీపేట, జూన్ 15: రాష్ట్రంలోనే పేరుపొందిన నవీపేట మేకల సంతలో శనివారం మేకల క్రయవిక్రయాలు జోరుగా కొనసాగాయి. సోమవారం జరిగే ముస్లింల పవిత్ర పండుగ బక్రీద్‌ను పురస్కరించుకుని భారీగా మేకల క్రయవిక్రయాలు జరిగాయి. మహరాష్ట్రలోని నాందేడ్, జాల్నా, ఔరంగాబాద్, పర్బనీ, బోకర్, నాయిగావ్ తదితర ప్రాంతాల నుంచి పెద్దఎత్తున మేకలు, గొర్రెలు సంతకు అమ్మకానికి రాగా తెలంగాణలోని పలు జిల్లాలతోపాటు ఆంధ్రప్రదేశ్, కర్నాటక, తదితర ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున కొనుగోలుదారులు నవీపేట సంతకు తరలివచ్చారు. మేకల కొనుగోలుకు సంబంధించి సంతలో సుమారు 8నుండి 10కోట్ల రూపాయల వ్యాపార లావాదేవీలు జరిగాయని వ్యాపారులు పేర్కొన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా మేక పోతులను కోసే ఆచారం ఉండడంతో సంతలో ఈ వారం మేకపోతులకు అధికంగా డిమాండ్ పలికింది. ప్రతీ వారం సంతలో 10 నుంచి 12 కిలోల బరువు ఉన్న మేక పోతులకు 8 నుంచి రూ.10వేలకు లభిస్తుండగా ఈ వారం అదే సైజులో ఉన్న మేక పోతులకు 13 నుంచి రూ.15వేల వరకు డిమాండ్ పలికిందని వ్యాపారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంతకు 32 నుంచి 35 కిలోల భారీ సైజులో ఉన్న మేకపోతులు సైతం అమ్మకానికి రాగా వాటి ధర సుమారు రూ.30వేల వరకు పలకడం విశేషం. సంతలో వ్యాపారం చేయడానికి స్థలం సరిపోకపోవడంతో రాంపూర్ వెళ్లే నెహ్రూ రోడ్డుపై మేకల క్రయవిక్రయాలు జరిగాయి. అలాగే సంతకు వచ్చిన వాహనాలకు పార్కింగ్ స్థలం సరిగా లేకపోవడంతో పలువురు రోడ్లకు ఇరువైపులా వాహనాలను నిలిపి ఉంచడంతో కొంతసేపు ట్రాఫిక్‌కు ఇబ్బంది ఏర్పడింది.



నవీపేట నెహ్రూ రోడ్డుపై కొనసాగిన మేకల సంత

మేకల సంతలో తాగునీటి కటకట

రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు పొందిన నవీపేట మేకల సంతలో కనీస సదుపాయలు లేకపోవడంతో వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రతీ శనివారం జరిగే సంతలో వేలాది మేకలు, గొర్రెలు విక్రయానికి వస్తుండగా వాటికి తాగునీటి సౌకర్యం లేకపోవడంతో జీవాలు దప్పికతో అలమటిస్తున్నాయి. పైగా సంతకు వచ్చే వ్యాపారులకు సైతం తాగునీటి సౌకర్యం లేకపోవడంతో వారు సమీపంలో ఉన్న హోటళ్లపై ఆధారపడాల్సి వస్తోంది. ప్రతీ సంవత్సరం గ్రామ పంచాయతీకి మేకల సంత ద్వారా లక్షలాది రూపాయల ఆదాయం సమకూరుతుండగా సంతలో కనీసం తాగునీటి సౌకర్యం లేకపోవడంపై వ్యాపారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

మేకపోతులకు డిమాండ్ ఉంది



- అస్లాం ఖురేషి, బోకర్, మహారాష్ట్ర

నవీపేట సంతకు నేను ప్రతీవారం మేకలను తీసుకువచ్చి విక్రయిస్తుంటాను. సోమవారం బక్రీద్ పండుగ ఉండడంతో సంతలో మేక పోతులకు డిమాండ్ ఏర్పడింది. గత వారం కంటే ఈ వారం మేకపోతులకు 3 నుంచి రూ.5వేల వరకు అధికంగా ధర పలికింది. అయినప్పటికీ కొనుగోలుదారులు ఆర్థికభారాన్ని సైతం లెక్క చేయకుండా కొనుగోలు చేస్తున్నారు.

సంతలో కనీస వసతులు కల్పించాలి



- ఇస్మాయిల్ అన్సారి, నాయిగావ్, మహారాష్ట్ర

సంతలో కనీసం తాగునీటి సౌకర్యం లేదు. దూర ప్రాంతాల నుంచి మేకలు, గొర్రెలను వేలాదిగా సంతకు వచ్చి వందల మంది వ్యాపారానికి వస్తుంటారు. జీవాలకు సైతం తాగునీరు లేక దప్పికతో అలమటిస్తున్నాయి. వ్యాపారులు సమీపంలో ఉన్న హోటళ్లను ఆశ్రయిస్తున్నారు. దాహంతో కొన్నిజీవాలు మార్గమధ్యలోనే మృతి చెందుతున్నాయి. దీనిపై అధికారులు స్పందించాలి.

17 నుంచి ఉచిత యోగా శిబిరం

రుద్రూరు, జూన్ 15 : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పతంజలి యజ్ఞ సహిత యోగ కేంద్రం ఆధ్వర్యంలో రుద్రూరు మండల కేంద్రంలో ఐదు రోజుల పాటు ఉచిత యోగా శిక్షణ శిబిరం నిర్వహించడం జరుగుతుందని డాక్టర్ విశ్వనాథ్ మహాజన్, రుద్రూరు మండల పతంజలి అధ్యక్షుడు కె.వి.మోహన్‌లు తెలిపారు. మండల కేంద్రంలోని జవహర్‌నగర్ కాలనీలోని పతంజలి యజ్ఞ సహిత యోగ కేంద్రంలో ఈనెల 17 (సోమవారం) నుంచి 21వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఉదయం 5.30 గంటల నుంచి 6.45 వరకు యోగా శిక్షణ శిబిరం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. యోగా శిక్షణ శిబిరంలో యోగ, ప్రకృతి బద్ధంగా జీవితంలో జీవన విధాన శైలిని పెంపొందించుకోవడానికి యోగాసనాలు, సూర్య నమస్కారాలు, సూక్ష్మ, స్థూల వ్యాయామాలు, యోగిక్ జాగింగ్, ప్రాణాయామం, ధ్యానం, ఆయుర్వేదం, ఆక్యుప్రెషర్, ముద్ర విజ్ఞానం నేర్పించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9491739436, 9949489697 నెంబర్‌లలో సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ తప్పనిసరి

బోధన్‌రూరల్,జూన్15: ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఉద్యోగ విరమణ, బదిలీ తప్పనిసరి అని మండల విద్యాశాఖ అధికారులు అన్నారు. బోధన్ మండలం కల్దుర్కి జిల్లా పరిషత్ పాఠశాలలో విధులు నిర్వహించి పదవి విరమణ పొందిన సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు చల్లా శ్రీనివాస్ రెడ్డి, బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయురాలు సుజాతకు మండల విద్యాశాఖ అధికారులు శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ, బదిలీలు ఉద్యోగంలో భాగమన్నారు.

రైతులకు సకాలంలో పంట రుణాలు అందించాలి

నవీపేట,జూన్15: వానకాలం సీజన్‌కు సంబంధించి రైతులకు సకాలంలో పంట రుణాలు అందించాలని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం నవీపేట ఎన్‌డీసీసీ బ్యాంకు మేనేజర్ శ్యామ్‌కు వినతిపత్రం సమర్పించారు. వర్షకాలం సీజన్ ప్రారంభమైనందున అర్హులైన రైతులందరికీ పంట రుణాలను అందించి వారిని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దేవేందర్ సింగ్, కిషన్ తదితరులున్నారు.

సీజ్ చేసిన ఇసుక వేలం

రెంజల్,జూన్15: మండలంలోని పేపర్‌మిల్ గ్రామంలో 50ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసిన తహసీల్దార్ శనివారం తహసీల్దార్ కార్యాలయంలో వేలంపాట నిర్వహించారు. వేలంలో ఐదుగురు మంది సభ్యులు పాల్గొనగా కందకుర్తి గ్రామానికి చెందిన ఈర్షన్ బేగ్ 61,500 రూపాయలకు వేలంలో కొనుగోలు చేశారు. వేలంలో కొనుగోలు చేసిన ఇసుకను తరలించాలని వేలం నిర్వాహకుడు ఈర్షన్ తహసీల్దార్ శ్రావణ్ కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రవికుమార్, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

గోవులను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

రెంజల్,జూన్15: బక్రీద్ పండుగను పురస్కరించుకుని శనివారం సాటాపూర్ మార్కెట్‌లో పశువుల క్రయవిక్రయాలు జోరుగా సాగడంతో ఎస్ఐ సాయన్న మార్కెట్‌లో పశువుల నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. పశువైద్య అధికారి పర్యవేక్షణలో క్రయవిక్రయాలు జరుపాలని లేనియెడల శాఖపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాల్లో పరిమితికి పశువులను తరలించరాదన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుళ్ల, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ సర్వే పరిశీలించిన డీఎల్‌పీవో

రుద్రూరు, జూన్ 15 :రుద్రూరు మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో మిషన్ భగీరథ ఇంటింటి సర్వే కొనసాగుతుంది. ఈ సర్వేలో భాగంగా శనివారం మండల కేంద్రంలోని అక్బర్‌నగర్, అంబం గ్రామాల్లో కొనసాగుతున్న మిషన్ భగీరథ సర్వేను డీఎల్‌పీవో సాయిబాబా పరిశీలించారు. లబ్ధిదారుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజు భగీరథ నీరు వస్తుందా లేదా అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండల వ్యాప్తంగా ఇప్పటి వరకు 50 శాతం సర్వే పూర్తయిందని ఎంపీవో సాయిలు వివరించారు. ఈ కార్యక్రమాలలో కార్యదర్శులు గంగారాం, శ్రవణ్ పాల్గొన్నారు.

కీటక జనిత వ్యాధులపై అవగాహన

రుద్రూరు, జూన్ 15 : రుద్రూరు మండల కేంద్రంలోని గంగపుత్ర సంఘం, ఐకేపీ ఆవరణలో మలేరియా మాసోత్సవాల సందర్భంగా శనివారం కీటక జనిత వ్యాధులపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డి.రాజేందర్ పాల్గొని మాట్లాడారు. దోమలు, వాటి ద్వారా వ్యాధులు మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, మెదడు వాపు వ్యాధుల లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించారు. నీటి నిల్వలను, కుండీలలో, డ్రమ్ములలో, కొబ్బరి బొండాలలో, టైర్లు, ప్లాస్టిక్ కప్‌లలో నిల్వ నీటిని పారబోయాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమలు కుట్టకుండా దోమ తెరలను వాడాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కె.రవి, సుమతి, ఆరోగ్య కార్యకర్తలు గౌరి, ప్రమీల, గిరీష్, ఆశా కార్యకర్తలు పుష్ప, ప్రమీల, ఇందిరలు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాల పంపిణీ

రుద్రూరు, జూన్ 15 :రుద్రూరు మండల కేంద్రంలోని జెడ్‌పీహెచ్ఎస్, ఉర్దూమీడియం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం ఎంపీపీ అక్కపల్లి సుజాత నాగేందర్ విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్‌బాబు, తహసీల్దార్ వెంకటేశం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అబ్బాపూర్(ఎం)లో దొంగతనం

నవీపేట, జూన్15: మండలంలోని అబ్బాపూర్(ఎం)లో శుక్రవారం రాత్రి దొంగతనం జరిగిందని ఎస్ఐ యాదగిరి గౌడ్ తెలిపారు. గ్రామానికి చెందిన కాడం కళావతి అనే మహిళ తన ఇంటికి తాళం వేసి పక్కనే ఉన్న తన కుమారుడి ఇంట్లో నిద్రించిందని అన్నారు. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు ఇంటి తాళం పగులగొట్టి లోపల ఉన్న తులం బంగారు గొలుసు, అర తులం బంగారం ఉంగరం ఎత్తుకెళ్లారని కళావతి కుమారుడు అరుణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నగరంలో పేకాట రాయుళ్ల అరెస్టు

ఖిల్లా, జూన్ 15: నగరంలోని 5వ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోగల ఇంద్రాపూర్ సమీపంలో పేకాట ఆడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి 10,600 రూపాయలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఖచ్చితమైన సమాచారం మేరకు తమ సిబ్బందితో పేకాట ఆడుతున్న స్థావరంపై దాడి చేయగా నలుగురు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

బిల్ కలెక్టర్‌లు, వార్డు ఆఫీసర్‌లకు సన్మానం

ఆర్మూర్‌టౌన్ , జూన్15: మున్సిపల్ కార్యాలయంలోని పని చేసే బిల్‌కలెక్టర్‌లకు, వార్డు ఆఫీసర్‌లకు శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య శ్రీనివాస్, కమిషనర్ రాజు ఘనంగా సన్మానించారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి చెందిన ఏప్రిల్ మాసంలో పన్ను వసూలులో జిల్లాలోనే మొదటి స్థానంలో నిలిచిన సందర్భంగా బిల్‌కలెక్టర్‌లను, వార్డు ఆఫీసర్‌లను పట్టుశాలువ, మెమెంటోలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

18 నుంచి ప్రజాపాలన దరఖాస్తులు

ఆర్మూర్‌టౌన్ జూన్15: ఈనెల 18 నుంచి ప్రజాపాలన దరఖాస్తులను మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య తెలిపారు. ఇప్పటి వరకు జీరో కరెంటు బిల్లు, సబ్సిడీపై గ్యాస్ పొందని వారు దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె తెలిపారు.

తైబజార్ వేలం పాట వాయిదా

ఆర్మూర్‌టౌన్ , జూన్15: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన తైబజార్ వేలం పాట వాయిదా పడిందని మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు. వేలం పాటలో ముగ్గురు పాల్గొనగా కనీస ధర రాకపోవడంతో వాయిదా వేశామని, ఈనెల 21న మళ్ళీ వేలం పాట ఉంటుందని తెలిపారు. వేలం పాటలో పాల్గొనేవారు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ వన్నెల్‌దేవి లావణ్య, వైస్‌చైర్మన్ మున్ను, తదితరులు పాల్గొన్నారు.

బీర్‌బాటిల్‌తో యువకుడిపై దాడి

ఆర్మూర్‌టౌన్, జూన్15: ఆర్మూర్ పట్టణ శివారులో బీహార్‌కు చెందిన సోన్‌కుమార్ అనే యువకునిపై గుర్తుతెలియని వ్యక్తులు బీర్ బాటిల్‌తో దాడి చేసినట్టు తెలిసింది. పట్టణ శివారులోని గుట్ట ప్రాంతంలో బీర్‌బాటిల్‌తో గొంతు వద్ద గాయాలు కాగా సోన్‌కుమార్ నడుచుకుంటూ రోడ్డుపైకి రావడంతో వాహనదారులు గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

లయన్స్ అధ్యక్షుడిగా గాలయ్య ఎన్నిక

బీర్కూర్, జూన్ 15 : బీర్కూర్ మండల కేంద్రంలోని లయన్స్ భవనంలో శనివారం లయన్స్ సభ్యులు సమావేశమయ్యారు. సమావేశంలో నూతన పాలక వర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇదిలా ఉండగా బీర్కూర్ మండల లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా గాలయ్యను ఎన్నుకున్నారు. కార్యదర్శిగా రవీందర్ జెట్లి, కోశాధికారిగా సీతాలే రమేష్, కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సభ్యులు తెలిపారు. అధ్యక్షుడిగా ఎన్నికైన గాలయ్యకు సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

● బోధన్ ఏసీపీ శ్రీనివాస్

బోధన్, జూన్15: బక్రీద్‌తో పాటు రాబోయే పండుగలను ప్రజలందరూ కలిసిమెలసి ప్రశాంతంగా జరుపుకోవాలని బోధన్ ఏసీపీ శ్రీనివాస్ అన్నారు. శనివారం సాయంత్రం బోధన్ పట్టణ పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పీస్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలందరు కలిసిమెలసి కులమతాలకు అతీతంగా పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా పట్టణంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. మండలంలో బక్రీద్‌పండుగ సందర్భంగా పరిశుభ్రతను పాటించాలన్నారు. ఎవరికి ఇబ్బందులు కలగకుండా పండుగలు జరుపుకోవాలన్నారు. అనంతరం మత పెద్దలు మాట్లాడారు.

సమయపాలన పాటించాలి : జిల్లా వైద్యాధికారి


ల్యాబ్‌ను తనిఖీ చేస్తున్న వైద్యాధికారి

పెద్దబజార్, జూన్ 15: టీహబ్, సఖీ సెంటర్లను శనివారం జిల్లా వైద్యాధికారి డాక్టర్ తుకారాం రాథోడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లా కేంద్రంలోని తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్, పాలియెటివ్ కేర్‌సెంటర్, సఖీ సెంటర్, అనాథల ఆశ్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ అందిస్తున్న సేవలను పర్యవేక్షించారు. తెలంగాణ డయాగ్నస్టిక్ హబ్‌లో డెంగ్యూ పరీక్ష ఎన్ఎస్-1 స్ట్రిప్స్ 223 అందుబాటులో ఉన్నాయని అన్నారు. మిగతా పరీక్షలకు సంబంధించి ఎన్ని కెమి కల్స్ స్టాక్ ఉన్నాయని, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున సరిపడా లాజిస్టిక్స్ కోసం ఇండెంట్ పెట్టి తెప్పించుకోవాలని సూచించారు. రికార్డులను పరిశీలించారు. 24 గంటల్లోగా రిపోర్టులు పేషెంట్‌కు చేరేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని, ల్యాబ్ టెక్నీషియన్‌లకు సూచించారు.

ట్యాలీవ్ కేర్ కేంద్రాన్ని సందర్శించగా.. అక్కడ డాక్టర్ చైతన్యకుమార్ అందుబాటులో లేనందున అడిగి తెలుసుకున్నారు. ఇన్‌పేషెంట్లు, కొత్తగా రోగులు ఎవరు రానందున క్షేత్రస్థాయి నుంచి ఇన్‌పేషెంట్లు వచ్చేలాగా చూడాలని సమయపాలన పాటించాలని హెచ్చరించారు. సఖి సెంటర్లలో సిబ్బంది ప్రతిరోజు సమయానికి వచ్చి సమయ పాలన పాటించాలని అక్కడి సిబ్బందికి తెలిపారు. అనాథల ఓపెన్ సెంటర్‌లో ఉండే వారికి తగిన సమయంలో వైద్య సౌకర్యాలు అందిస్తు చికిత్సను సమయానికి ఇవ్వాలని ఆరోగ్యంగా ఉండేలా చూడాలని ఆదేశించారు.

ఆరోపణలు రుజువు చేస్తే తప్పుకుంటాం


రాజీనామా పత్రాన్ని చూపిస్తున్న ఎమ్మెల్యే పీఏలు వికాస్, సిద్దు

- 48 గంటల్లో రుజువు చేయాలి
- ఆధారాలు నిరూపించకపోతే పరువు నష్టం దావా వేస్తాం

ఎల్లారెడ్డి, జూన్ 15 : మేము ఎక్కడైనా డబ్బులు వసూలు చేసినట్లు గాని, ఎవరికైనా బెదిరించినట్లు గాని నిరూపిస్తే తమ పదవుల నుంచి తప్పుకుంటామని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు వ్యక్తిగత సహాయకులు వికాస్, సిద్దు అన్నారు. శనివారం ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలోని వీకేపీ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారిపై వచ్చిన ఆరోపణలపై మాట్లాడుతూ ఏమైనా ఆధారాలు ఉంటే 48 గంటలలో ఆధారాలు నిరూపించాలని లేనిచో పరువు నష్టం దావా వేస్తామన్నారు. ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు దగ్గర గత కొన్ని సంవత్సరాల నుంచి పని చేస్తూ ప్రజలకు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామని, మా ఎదుగుదలను ఓర్వలేక, ఎమ్మెల్యేకు గాని మాకు చెడ్డ పేరు తీసుకురావడానికి ప్రయత్నిస్తే దానికి తగిన గుణపాఠం చెబుతామని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కురుమ సాయిబాబా, పట్టణ అధ్యక్షుడు వినోద్‌గౌడ్, సుజిత్, విద్యాసాగర్, చెన్న లక్ష్మణ్, జడ్పీటీసీ ఉషాగౌడ్, అజార్ ఖాద్రి, ఆరీఫ్, నాగం గోపి కృష్ణ, సంతోష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారులకు వసతులు కల్పించండి

● ఏసీపీకి ఎంఐఎం నేతల వినతి


ఏసీపీకి వివరాలు తెలుపుతున్న ఎంఐఎం నేతలు

ఖిల్లా, జూన్ 15: బక్రీద్ పండుగను పురస్కరించుకొని ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు రాత్రివేళ వ్యాపారాలు చేసుకునే అవకాశాలు వ్యాపారులకు కల్పించాలని ఎంఐఎం నేతలు నిజామాబాద్ ఏసీపీ రాజావెంకటరెడ్డికి విన్నవించారు. శనివారం ఆయన ఛాంబర్‌లో కలిసి బక్రీద్ పండుగ ఉన్నందున నగరం నుంచి బోధన్‌వైపుకు వెళ్లే ఆర్టీసీ బస్సులను మళ్లించాలని కోరారు. స్పందించిన ఏసీపీ పండుగను శాంతియుతంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జరుపుకోవాలని సూచించారు. ప్రజల కోసమే పోలీసు వ్యవస్థ పనిచేస్తుందని ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని తెలిపినట్లు ఎంఐఎం ప్రతినిధులు తెలిపారు. ఏసీపీని కలిసిన వారిలో ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు షకీల్‌హామద్ ఫాజిల్, డిప్యూటీ మేయర్ ఇద్రిస్‌ఖాన్, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, ఎంఐఎం నాయకులు మునవర్‌అలీ, షహబాస్, తదితరులున్నారు.

వ్యాధులపై అవగాహన పెంచుకోవాలి



వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న నోడల్ ఆఫీసర్ రాజేందర్

రుద్రూరు, జూన్ 15 : రుద్రూరు మండల కేంద్రంలోని గంగపుత్ర సంఘం, ఐకేపీ ఆవరణలో మలేరియా మాసోత్సవాల సందర్భంగా శనివారం కీటక జనిత వ్యాధులపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ డి.రాజేందర్ పాల్గొని మాట్లాడారు. దోమలు, వాటి ద్వారా వ్యాధులు మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికెన్ గున్యా, మెదడు వాపు వ్యాధుల లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించారు. నీటి నిల్వలను, కుండీలలో, డ్రమ్ములలో, కొబ్బరి బొండాలలో, టైర్లు, ప్లాస్టిక్ కప్‌లలో నిల్వ నీటిని పారబోయాలన్నారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమలు కుట్టకుండా దోమ తెరలను వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్లు కె.రవి, సుమతి, ఆరోగ్య కార్యకర్తలు గౌరి, ప్రమీల, గిరీష్, ఆశా కార్యకర్తలు పుష్ప, ప్రమీల, ఇందిరలు పాల్గొన్నారు.

ఇస్కాన్ కేంద్రానికి ప్రచార వాహనం అందజేత


నగరంలో ప్రచార రథాన్ని అందజేస్తున్న దృశ్యం

పెద్దబజార్, జూన్ 15: నగరంలో వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ శ్రీకృష్ణుని భక్తితత్వాన్ని బోధిస్తూ ప్రజలను ధర్మంవైపు నడిపించే విధంగా విశేష కృషిని నిర్వహిస్తున్న ఇస్కాన్ కంఠేశ్వర్ కేంద్రానికి ఇందూరు నగరం మహేశ్వరి సేవా సమాజ్ ధర్మప్రచార రథాన్ని బహుమతిగా ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ఇస్కాన్ కేంద్ర నిర్వహకుడు రామానంద ప్రభు, మహేశ్వరి సమాజ్ ప్రతినిధులు రామ్‌స్వరూప్ డాలియా, కమల్ కిశోర్, పవన్ కేడియా, బాలకృష్ణ ఇనాని, గిరిదారి, విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు దినేష్ ఠాకూర్, హిందూ వాహిని జిల్లా అధ్యక్షుడు అనిల్‌కదం, దాత్రిక రమేష్, తదితరులు పాల్గొన్నారు.

'రైతు పేరిట రాజకీయం తగదు'


లింగంపేటలో విలేకరులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

లింగంపేట, జూన్ 15 : పొల్కంపేటలో ఎన్‌డీసీసీబీ బ్యాంక్ అధికారులు రైతు పొలంలో ఫ్లెక్సీ పాతితే దానిని ముఖ్యమంత్రితో పాటు కాంగ్రెస్ పార్టీకి బురద అంటించి రాజకీయం చేయడం తగదని మాజీ ఎమ్మెల్యే సురేందర్‌ను శనివారం కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. శనివారం లింగంపేట కాంగ్రెస్ మండల పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పార్టీ అధ్యక్షుడు బుర్ర నారాగౌడ్ మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే సురేందర్ బ్యాంక్ ఎదుట ధర్నా చేయడం సిగ్గుచేటన్నారు. గత 10సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ రైతులకు రిబెట్ ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలో ఉండగా రైతులకు రిబెట్ ఇచ్చిందని ఆయన తెలిపారు. గత 10సంవత్సరాలు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ పార్టీ ఎందుకు రుణమాఫీ చేయలేదని ఆయన ప్రశ్నించారు. నిజాలు తెలుసుకోకుండా కాంగ్రెస్ పార్టీపై నిందలు వేయడం మానుకోవాలని వారు సూచించారు. మరోసారి కాంగ్రెస్ పార్టీపై నిందలు వేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని మాజీ ఎమ్మెల్యే సురేందర్‌ను కాంగ్రెస్ నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎల్లమయ్య, ఫతియోద్దీన్, అట్టెం శ్రీను, ప్రసాద్‌గౌడ్, జక్సాని రవి, నయీం, భైరయ్య, సాయికుమార్, గంగారెడ్డి, రఫీఖ్ నాయకులు ఉన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం


కొనసాగుతున్న వైద్య శిబిరం

బోధన్‌రూరల్,జూన్15: వాసవీ ఇంటర్నేషనల్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే డాన్ టు డాస్క్‌లో భాగంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీ క్లబ్, వనిత ఆధ్వర్యంలో ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అనంతరం పట్టణంలోని కన్యాకా పరమేశ్వరి ఆలయంలో మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ అడిషనల్ ట్రెజరర్ కొత్త రవీందర్, ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ మహాజన్‌రాణి, 103జిల్లా గవర్నర్ జాడే సుదర్శన్ గుప్తా, రీజినల్ చైర్‌పర్సన్ సతీష్, జోన్ చైర్మన్ రాజు, వాసవి క్లబ్ బోధన్ కార్యదర్శి డాక్టర్ సూర్యరావు, డాక్టర్ సురేష్, వాసవి క్లబ్ వనిత అధ్యక్షురాలు శాంతిశ్రీ, సెక్రెటరీ అంజలి జాంకార్, కోశాధికారి రాజశ్రీ, కంటాల రమేష్ పాల్గొన్నారు.

'ఉపాధ్యాయుల పదోన్నతిలో న్యాయం చేయాలి'


కోటగిరిలో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

కోటగిరి,జూన్15: ఉపాధ్యాయుల పదోన్నతిలో ఎస్‌జీటీ ఉపాధ్యాయులందరిని సీనియారిటి ప్రకారం పదోన్నతి కల్పించాలని ఉమ్మడి పీఆర్‌టీయూ మండలాల నాయకులు డిమాండ్ చేశారు. కోటగిరి మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో శనివారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పీఆర్‌టీయూ నాయకులు కృష్ణ మోహన్ మాట్లాడుతూ పండిత్, పీఈటీ అప్‌గ్రేటేషన్ కామన్ సీనియారిటీ ప్రకారం పదోన్నతి కల్పించాలన్నారు. ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం పోస్టులలో బీఈడీ అర్హత గల ఎస్‌జీటీ ఉపాధ్యాయులకు జీవో 12 ప్రకారం పదోన్నతి కల్పించాలన్నారు. 25సంవత్సరాల సర్వీసు ఉండి హెచ్ఎం బాధ్యతలు నిర్వహిస్తున్నప్పటికీ పదోన్నతి విషయంలో కేవలం బీఈడీ వారినే పరిగణలోకి తీసుకోవడం అన్యాయం అన్నారు. ఎస్‌జీటీ టీచర్లకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నాయకులు వెంకటేష్, గంగారాజు, సాయిలున్నారు.

పార్లమెంట్ ఎన్నికలు.. పరిశీలన అంశంపై చర్చాగోష్టి


సమావేశంలో మాట్లాడుతున్న రాజకీయ విశ్లేషకులు అబ్బాస్

పెద్దబజార్, జూన్ 15: బీజేపీ నియంతృత్వ, మతోన్మాద పోకడలను, మోదీ అహంకారాన్ని పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించారని రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి విలువలకు పట్టం కట్టారని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు ఎండీ అబ్బాస్ అన్నారు. మల్లు స్వరాజ్యం మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రామ్మోహన్‌రావు అధ్యక్షతన పార్లమెంట్ ఎన్నికలు-పరిశీలన అంశంపై శనివారం ట్రస్ట్‌భవనంలో చర్చాగోష్టి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎండీ అబ్బాస్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి పెద్ద ఎదురుదెబ్బ తగిలిందని 400 సీట్లు సాధించి రాజ్యాంగాన్ని మార్చాలని చూసిన బీజేపీకి 240 సీట్లు మాత్రమే ఇచ్చి ప్రజలు ముక్కుతాడు వేశారని అన్నారు. ప్రజల దైనందిన జీవిత సమస్యలు పరిష్కారం చేయడంలో విఫలం చెందిన బీజేపీ, మత విద్వేషాలు రెచ్చగొట్టి మరోసారి విజయం సాధించాలని చూసిందని, దీనిని ప్రజలు తిరస్కరించారని అన్నారు. విభిన్న సంస్కృతుల నిలయమైన దేశాన్ని ఏక సంస్కృతిలోకి కుదించాలనే బీజేపీ ప్రయత్నాన్ని ప్రజలు ప్రతిఘటించారని, వైవిధ్యమే మన దేశ బలమని, దానినే ప్రజలు కాపాడుకోవడం కోసం కృషి చేశారని అన్నారు. ఈ సమావేశంలో హుస్సేన్, నారాయణ, చంద్రశేఖర్, రాధాకిషన్, తదితరులు పాల్గొన్నారు.

స్వదేశీ జాగరణ్ మంచ్ కరపత్రాల విడుదల

కామారెడ్డిరూరల్,జూన్15:జూన్ 23న హైదరాబాద్‌లో జరిగే స్వదేశీ జాగరణ, స్వావలంబి భారత అభియాన్ తెలంగాణ ప్రాంత సభ కరపత్రాలను శనివారం ఆర్కిడ్స్ పాఠశాలలో నిర్వహించిన విస్తృతస్థాయి సమావేశంలో విడుదల చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ కామారెడ్డి జిల్లా కార్యవాహ పట్లోళ్ళ సంతోష్ రెడ్డి పాల్గొన్నారు.ఆయన మాట్లాడుతూ జూన్ 23న తేదీన కేశవ మెమోరియల్ ఇంజనీరింగ్ కళాశాల హైదరాబాద్ యందు స్వదేశీ జాగ రణ మంచ్ స్వావలంబి భారత అభియాన్ ఆధ్వర్యంలో ప్రాంత సభ నిర్వహిస్తున్నారని మంత్రులు, శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలు హాజరవుతారని తెలిపారు.

కార్యక్ర మంలో స్వదేశీ జాగరణ మంచ్ కార్యకర్తలు బొర్రా రాజగౌడ్, గోవర్ధన్ రెడ్డి,డా. యాలాద్రి, డా.రాహుల్ కుమార్, సంతోష్‌గౌడ్, జంగం నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మేజర్ లీగ్ బేస్‌బాల్ పోటీలకు సిరికొండ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సిరికొండ జూన్ 15 : ఈ నెల 19 నుంచి 23 వరకు బెంగళూర్‌లో జరిగే జాతీయస్థాయి మేజర్ లీగ్ ఇండియా క్రీడా పోటీలకు సిరికొండ సత్యాశోధక్ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో జరిగిన తెలుగు రాష్ట్రాల మేజర్ లీగ్ బేస్‌బాల్ 12వ చాంపియన్‌షిప్ క్రీడల పోటీలలో సత్యశోధక్ పాఠశాల విద్యార్థులు విజేతగా నిలిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.నర్సయ్య తెలిపారు. చాంపియన్‌షిప్ సాధించడంతో జాతీయస్థాయి క్రీడాపోటీలకు విద్యార్థులు అర్హత సాధించారని ఆయన తెలిపారు. బెంగళూర్‌లో జరిగే జాతీయ పోటీలలో విద్యార్థులు పాల్గొంటున్నారని నర్సయ్య తెలిపారు.

ముగిసిన డిగ్రీ పరీక్షలు

డిచ్‌పల్లి,జూన్ 15: తెలంగాణ విశ్వవిద్యాలయం పరిధిలో శనివారం ఉదయం జరిగిన డిగ్రీ 5వ సెమిస్టర్ బ్యాక్‌లగ్ పరీక్ష, మధ్యాహ్నం జరిగిన 2వ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉమ్మడి నిజామాబాద్ పరిధిలోని 38 పరీక్ష కేంద్రాల్లో ఉదయం జరిగిన పరీక్షలకు 9022 అభ్యర్థులకు గాను 8281 మంది హాజరుకాగా 738 విద్యార్థులు గైర్హాజరయ్యారని, మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 9383 మంది విద్యార్థులకు గాను 8464పరీక్షకు హాజరయ్యారని, 91మంది విద్యార్థులు ఈ పరీక్షలకు గైర్హాజరయ్యారని ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంట చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. 4ప్రత్యేక స్క్వాడ్ బృందాలు తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు.

రిపేర్ షెడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



భూమిపూజ చేస్తున్న మేయర్

సుభాష్‌నగర్, జూన్ 15: నగర పాలక సంస్థ పరిధిలోని వాహనాల మరమ్మతుల కోసం నిర్మించనున్న షెడ్డుకు నగర మేయర్ దండు నీతూకిరణ్ కమిషనర్ మకరంద్‌తో కలిసి శనివారం భూమిపూజ చేసి ప్రారంభించారు. నగరంలోని ఖిల్లా ఫిల్టర్‌బెడ్ ప్రాంతంలో వాహ నాల మరమ్మతుల కేంద్రంకు భూమిపూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నగరమేయర్ దండునీతూకిరణ్ మాట్లాడుతూ వాహనాల నిర్వహణ కోసం అవసరమైన చిన్న చిన్న రిపేర్‌లు చేసేందుకు 43 లక్షల రూపాయల నిధులతో ఈ షెడ్డును నిర్మాణం చేయడం జరు గుతుందన్నారు. రోజువారి చెత్త తరలింపు చేసే వాహనాలను, నీటి సరఫరా చేసే వాహనాలకు ఏవైనా రిపేర్‌లు వచ్చినట్లయితే షోరూంలో చేయించడం ద్వారా సమయం వృథా కావడమే కాకుండా చెత్త నిర్వహణపై భారం పడుతుందన్నారు. చిన్న చిన్న రిపేర్‌లు చేయడానికి వీలుగా షెడ్డు నిర్మాణం చేస్తున్నామని అన్నారు. పనుల్లో జాప్యం జరుగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మమత, మున్సి పల్ డిప్యూటీ ఇంజనీర్ ఆనంద్‌సాగర్, అసిస్టెంట్ ఇంజనీర్ ఇనాయక్ కరీమ్ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూరు అధ్యక్షుడిగా జిలకర విజయ్



పెద్దబజార్, జూన్ 15:లయన్స్‌క్లబ్ ఆఫ్ ఇందూరు అధ్యక్షుడుగా జిలకర విజయ్‌ఆనంద్ 2024-25 సంవత్సరానికి గాను లయన్స్ జోన్ చైర్మన్‌గా నియమితులయ్యారు. లయన్స్ జిల్లా గవర్నర్ నగేష్ పంపటి శనివారం విజయ్ ఆనంద్‌కు నియామకపత్రం అందజేశారు. విజయ్ ఆనంద్ లయన్స్‌క్లబ్ ఆఫ్ ఇందూరు, కామారెడ్డి, కామారెడ్డి వివేకానంద, సదాశివనగర్ క్లబ్‌లకు జోన్ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. లయన్స్ సేవలను మరింత విస్తృతపరుస్తానని అన్నారు. తనపై నమ్మకంతో జోన్ చైర్మన్ పదవి ఇచ్చిన జిల్లా గవర్నర్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. క్లబ్ కార్యదర్శి చింతల గంగాదాస్, కోశాధికారి మచ్చ రవీందర్, పూర్వ అధ్యక్షులు డి.యాదగిరి, లక్ష్మి నారాయణ, బిగురుప్రసాద్‌లు హర్షం వ్యక్తం చేశారు.

సెంట్రల్ లైటింగ్ డివైడింగ్ పనుల పరిశీలన

జక్రాన్‌పల్లి, జూన్15: మండల కేంద్రంలో శనివారం సెంట్రల్ లైటింగ్, డివైడింగ్, బీటీరోడ్డు పనులను గ్రామ ప్రత్యేక అధికారి బ్రహ్మానందం పరిశీలించారు. జక్రాన్‌పల్లి 44వ జాతీయ రహదారి నుంచి గ్రామంలోని అంబేద్కర్‌చౌరస్తా వరకు నిర్మిస్తున్న సెంట్రల్ లైటింగ్ పనులతో పాటు డివైడింగ్, ఇరువైపుల బీటీరోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ పనులు నాణ్యతతో చేపట్టాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. ఆయన వెంట అధికారులు, తదితరులున్నారు.

తొర్లికొండలో ఘనంగా వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

జక్రాన్‌పల్లి, జూన్15:మండలంలోని తొర్లికొండలో శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయం ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. శనివారం తెల్లవారుజాము నుంచి భక్తులు కొండపై చేరుకొని స్వామివారి పల్లకిని కొండచుట్టు ప్రదక్షిణ చేయించారు. అనంతరం ఆలయంలో భక్తులు, గ్రామస్థులు ప్రత్యేకపూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదానం నిర్వహించారు. కొండపై నూతనంగా నిర్మిస్తున్న శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం నిర్మాణానికి భక్తులు, గ్రామస్థులు విరాళాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ, వీడీసీసభ్యులు భక్తులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టండి

● ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసిన డీఈవో



తొండాకూర్ పాఠశాలలో మధ్యాహ్న భోజన తీరును పరిశీలిస్తున్న డీఈవో దుర్గాప్రసాద్

డొంకేశ్వర్, జూన్ 15: మండలంలోని తొండాకూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను శనివారం జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్ తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి భోజన తీరును అడిగితెలుసుకున్నారు. పాఠశాలలో రికార్డులు, రిజిష్టర్‌లను పరిశీలించారు. మధ్యాహ్న భోజనం పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందజేయాలని ఆయన సూచించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను మరింత పెంచాలని వివరించారు. వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు తెలిపారు. ప్రధానోపాధ్యాయుడు లింగారెడ్డి, సాహితి విద్య, కో-ఆర్డినేటర్ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

నందిపేట:పల్లెలో గ్రామాభివృద్ధి కమిటీల సహకారం ఉంటే ప్రభుత్వ పాఠశాలలు మరింత అభివృద్ధి చెందుతాయని జిల్లా విద్యాధికారి దుర్గాప్రసాద్ అన్నారు. శనివారం నందిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అడ్మిషన్ ఐఎఫ్‌పీఎస్‌లపై సమీక్ష నిర్వహించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన తనిఖీ చేసిన ఆయన విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం గ్రామాభివృద్ధి కమిటీలో డీఈవో దుర్గాప్రసాద్ సమావేశమయ్యారు. వీడీసీ సహకారం ఉంటే ప్రతీ పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించవచ్చన్నారు. వీడీసీ సహకరిస్తే ప్రభుత్వ హైస్కూల్ ప్రాథమిక పాఠశాలలకు నిధులు సమకూర్చవచ్చని ఆయన పేర్కొ న్నారు. కార్యక్రమంలో జీఎంవో శ్రీనివాస్‌రావు, హైస్కూల్ హెచ్ఎం ఎం.మంజుల, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం మల్కన్న, వీడీసీసభ్యులు, తదితరులు ఉన్నారు.

బస్టాండ్ ఆవరణలో ఆర్టీసీ కాంప్లెక్స్ నిర్మాణం

● డిచ్‌పల్లి బస్టాండ్‌ను పరిశీలించిన ఆర్టీసీ ఆర్ఎం



డిచ్‌పల్లి బస్టాండ్‌ను పరిశీలిస్తున్న ఆర్టీసీ ఆర్ఎం జానిరెడ్డి

డిచ్‌పల్లి,జూన్ 15: ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో వ్యాపారస్థుల కోసం ఆర్టీసీ సముదాయాల కోసం నూతన నిర్మాణం త్వరలో ప్రారంభం అవు తుందని, ఇందుకోసం టెండర్లు పూర్తి అయ్యాయని ఆర్టీసీ రీజినల్ మేనేజర్ జానిరెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం ఆయన డిచ్‌పల్లి ఆర్టీసీ బస్టాండును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రయాణికుల శ్రేయస్సు దృష్ట్యా నూతనంగా వ్యాపార సముదాయాలు నిర్మించనున్నామని, త్వరలో పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు. ఇందల్వాయిలోని ఆర్టీసీ ఆధ్వర్యంలో నడిచే పెట్రోల్ పంపు నిర్వహణకు వేరే వాళ్ల ఇవ్వడం జరిగిందని, డిచ్‌పల్లి బస్టాండ్ వద్ద ప్రతిపాదిత పెట్రోల్ పంపు నిర్మాణానికి ఎన్‌వోసీ రాకపోవడంతో జాప్యం ఏర్పడిందన్నారు. డిచ్‌పల్లి బస్టాండ్ ద్వార మార్గం ద్వార నడిచే బస్సుల వివరాలను డిచ్‌పల్లి ఆర్టీసీ కంట్రోలర్ చందర్ నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు.

పరిసరాలను పరిశ్రుభంగా ఉంచుకోవాలి

● డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రమేష్



అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో

ఆర్మూర్‌టౌన్ , జూన్15: పట్టణంలోని యుపీహెచ్‌సీ కేంద్రంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రమేష్ డివామింగ్ డేపై ఎఎన్ఎం ఆశ, అంగన్‌వాడి కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్బెండజోల్ మాత్రలను 19ఏళ్ళ లోపు వారికి వేయాలని, ప్రతీ అంగన్‌వాడి సెంటర్, ప్రభుత్వ పాఠశాల, కళాశాలలో ప్రోగ్రాం నిర్వహించాలని, రాబోయే సీజనల్ వ్యాధులు, డెంగ్యు వ్యాధి, మలేరియా గురించి ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ అయేషా ఫతిమా, సబ్‌యూనిట్ ఆఫీసర్ సాయి, హెల్త్ అసిస్టెంట్ బట్టు ఆనంద్, ఎఎన్ఎం అనురాధ, రాజవ్వ, విజయ, కమల, అంగన్‌వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.

భగీరథ సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

● ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ధర్మేందర్



సుద్దపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న అధికారి

డిచ్‌పల్లి,జూన్ 15: అన్ని గ్రామాల్లోమిషన్ భగీరథ కుళాయిలు ద్వార తాగునీరు అందుతున్న వివరాలను క్షేత్ర స్థాయిలో అధికారులు పకడ్బందిగా నిర్వహించాలని సర్వేలో ఎలాంటి లోటు పాట్లు తలెత్తకుండా జాగ్రత్తలు చూపాలని డీఈ ధర్మేందర్ అన్నారు. శనివారం మండలంలోని సుద్దపల్లి, యానంపల్లి గ్రామాల్లో ఆయన సర్వే నిర్వహించగా ఎంపీవో శ్రీనివాస్ గౌడ్ ధర్మారం,బర్ధిపూర్, అమృతాపూర్ గ్రామాల్లో మిషన్ భగీరథ సర్వేను నిర్వహించి గ్రామస్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుళాయి ఉన్న ప్రతి ఒక్కరికి 100లీటర్ల తాగు నీరు ఒక్కోక్కరికి సరఫరా జరగాలనే ఉద్దేశంతోనే ప్రభుత్వం పకడ్బందీగా నిర్వహి స్తున్నట్లు శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రిని కలిసిన అర్బన్ ఎమ్మెల్యే



మంత్రి దామోదర రాజానర్సింహాకు వినతిపత్రం అందజేస్తున్న ధన్‌పాల్

పెద్దబజార్, జూన్ 15: తెలంగాణ సచివాలయంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజా నర్సింహాను నిజామా బాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ శనివారం కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా అర్బన్ ఎమ్మెల్యే మాటాడుతూ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో కనీస మౌలిక సౌకర్యాలు లేవని, వివిధ విభాగాల్లో సరిపడా వైద్యులు లేక ప్రజలు ఇబ్బం దులకు గురవుతున్నారని తెలిపారు. అత్యవసర సమయంలో రోగులు జిల్లా సివిల్ ఆసుపత్రిలో సరైన మౌలిక సౌకర్యాలు, వైద్యులు లేక హైదరాబాద్‌కు రావాల్సిన పరిస్థితి ఉందని అన్నారు. తక్షణమే సివిల్ ఆసుపత్రిలో ప్రజలకు అన్ని మౌలిక వసతులు కల్పించి వివిధ విభాగాల్లో వెంటనే వైద్యులను నియమించాలని నిధులు విడుదల చేయాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు.

కంజరలో వివాహిత ఆత్మహత్య

మోపాల్, జూన్ 15: మోపాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కంజర్ గ్రామానికి చెందిన వివాహిత మహిళ వర్ష (40) చికిత్స పొందుతూ శుక్రవారం అర్ధరాత్రి మరణించినట్లు ఎస్సై గంగాధర్ శనివారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కంజర్ గ్రామానికి చెందిన వర్షకు అదే గ్రామానికి చెందిన గోవర్ధన్‌తో గత 13 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడున్నారు. గత కొన్ని రోజుల నుంచి భార్యభర్తల మధ్య గొడవలు రావడంతో మనస్థాపం చెందిన వర్ష గత నెల 27వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్యం కుదుటపడటంతో ఇంటికి తీసుకువచ్చారు. రెండురోజుల క్రితం పరిస్థితి విషమించడంతో తిరిగి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మరణించిందని ఎస్సై తెలిపారు. భర్త వేధింపుల వల్లే తమ కూతురు మరణించినట్లు వర్ష కుటుంబసభ్యులు ఫిర్యాదు చేశారు.

చెట్టుకు ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నందిపేట, జూన్15: మండల కేంద్రంలోని బస్‌డిపో సమీపంలో రాగి చెట్టుకు బుర్రి లక్ష్మణ్(38) అనే వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై జి.రాహుల్ తెలిపారు. నిర్మల్ జిల్లా తనూర్ మండల కేంద్రానికి చెందిన బుర్రి లక్ష్మణ్ తన భార్య పిల్లలతో కలిసి నిజామాబాద్ జిల్లా మోపాల్ మండలం మంచిప్ప గ్రామంలో వ్యవసాయ కూలీగా పని చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఇటీవల తన తమ్ముడు బుర్రి గంగాధర్ నివాసముంటున్న నందిపేట మండల కేంద్రానికి వచ్చాడు. ఆర్థిక ఇబ్బందులు తాళలేక తాగుడికి బానిసై చెట్టుకు ఉరి వేసుకొని మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. మృతుని తమ్ముడు గంగాధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై జి.రాహుల్ వివరించారు.

ముప్కాల్ పంచాయతీ సెక్రెటరీ సస్పెండ్

ముప్కాల్, జూన్15: ముప్కాల్ గ్రామ పంచాయతీ గ్రేడ్3 సెక్రెటరి విజయ్ కుమార్‌ను సస్పెండ్ చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ముప్కాల్‌లో ఏర్పాటు చేసిన లేఅవుట్‌లో నిబంధనలు పాటించకపోవడం, పంచాయతీ పరిధిలోని ఖాళీస్థలాలకు నిబంధనలకు విరుద్ధంగా ఇంటినెంబర్ల కేటాయింపు ఇతర ఫిర్యాదులపై వివరణ ఇవ్వకపోవడంతో సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా తన తండ్రి అనారోగ్యంతో ఆస్పత్రిలో ఉండడం వలన వివరణ ఇవ్వలేకపోయానని సెక్రెటరీ చెబుతున్నారు.

మెరిట్ స్కాలర్‌షిప్‌నకు ముగ్గురు విద్యార్థుల ఎంపిక

డొంకేశ్వర్, జూన్15: నేషనల్ మిన్స్‌కం మెరిట్ స్కాలర్‌షిప్‌కు డొంకేశ్వర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న సుంకరి సహ స్ర, తొండాకూర్ జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న శ్రీహ న్య, సాత్వికలు ఎంపికైనట్లు ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థులకు 9వ తరగతి నుంచి ఇంటర్మీడియేట్ వరకు ప్రతీ ఏడాది రూ.12వేల చొప్పున కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందని వారు తెలిపారు. ఈ సందర్భంగా నేషనల్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులను పాఠశాల హెచ్ఎం.సురేష్‌కుమార్, లింగారెడ్డిలు అభినందించారు.

ముప్కాల్ పాఠశాల విద్యార్థుల ఎంపిక

ముప్కాల్, జూన్15: ముప్కాల్ ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు నేషనల్ మిన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు గంగారాం తెలిపారు. ప్రతీ సంవత్సరంలాగే నేషనల్ స్కాలర్‌షిప్ వారు నిర్వహించిన పరీక్షల్లో ముప్కాల్ ప్రభుత్వ పాఠశాల నుంచి పి.సుశాంత్, బి.స్వరూప, ఎ.నిత్యశ్రీ, డి.వైష్ణవి, జి.నందుశ్రీలు ఎంపికయ్యారు. వీరికి నాలుగు సంవత్సరాల పాటు రూ.12వేల చొప్పున కేంద్ర ప్రభుత్వం అందజేస్తుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావడానికి కృషిచేసిన ఉపాధ్యాయులను, ఐదుగురు విద్యార్థులను పాఠశాల హెచ్ఎం గంగారాం, సిబ్బంది అభినందించారు.

కోడ్ ముసిగినా ఎన్టీఆర్ విగ్రహానికి తొలగని ముసుగు



విగ్రహానికి తొలగించని ముసుగు

ముప్కాల్, జూన్15: కోడ్ కూసిందనగానే జాతీయ నాయకుల విగ్రహాలకు ముసుగులు వేశారు. రోడ్లపైకి వచ్చి వాహనాల తనిఖీలు చేయడం, బ్యానర్లు తొలగించడం, మతపరమైన తోరణాలు తొలగించడం, గోడలపై ఉన్న రాతలను తుడిసి వేయడం చేశారు. కానీ ఎన్నికల కోడ్ ముగి సిన పదిరోజులైనా బాల్కొండ మండలం శ్రీరాంపూర్ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల బస్టాండ్ సమీపంలో ఉన్న తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి.రామారావు విగ్రహానికి ముసుగు తొలగించడంలేదు. పార్లమెంట్ ఎన్నికల కోడ్ మార్చి 16వ తేదీ రాత్రికి అమలులోకి వచ్చింది అదే కోడ్ జూన్ 6వ తేదీ రాత్రి ఎత్తివేశారు. అయిన అధికారులు ముసుగు తొలగించడంలేదని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

గ్రూప్-2 పోస్టులు పెంచాలని నిరుద్యోగుల వినతి



ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న నిరుద్యోగులు

ఆర్మూర్‌రూరల్, జూన్15: రాష్ట్రంలో గ్రూప్-2, గ్రూప్-3 పోస్టులను పెంచాలని కోరుతూ శనివారం నిరుద్యోగులు ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ విషయమై సీఎం రేవంత్‌రెడ్డికి కూడా తమ వినతిపత్రాన్ని పంపినట్టు వారు తెలిపారు. ప్రతీ సంవత్సరం ఎందరో విద్యార్థులు తమ చదువు పూర్తి చేసుకొని బయటకు వస్తున్నారని, నిరుద్యోగుల సంఖ్య ఎక్కువవుతుండగా పోస్టులు తక్కువగా ఉంటున్నాయని వారు పేర్కొన్నారు. ఉద్యోగాలు తక్కువ ఉండడంతో నిరుద్యోగయువతకు ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారన్నారు. గ్రూప్-2, గ్రూప్-3 పోస్టులు పెంచి నిరుద్యోగులకు అవకాశాలు ఎక్కువ ఉండేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

దేగాం యాదగౌడ్‌ను పరామర్శించిన మాజీమంత్రి మండవ



దేగాం యాదాగౌడ్‌ను పరామర్శిస్తున్న మాజీమంత్రి మండవ

ఆర్మూర్‌రూరల్, జూన్15: నిజామాబాద్ జిల్లా టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు దేగాం యాదాగౌడ్‌ను శనివారం మాజీమంత్రి మండవ వెంకటేశ్వర్‌రావు పరామర్శించారు. ఇటీవల యాదాగౌడ్ తల్లి మరణించడంతో మండవ ఆయనను పరామర్శించారు. అదే విధంగా వేల్పూర్, జక్రాన్‌పల్లి మాజీఎంపీపీలు మోతె రామాగౌడ్, కె.అనంత్‌రెడ్డి, సరిత మోహన్, తదితరులు దేగాం యాదాగౌడ్‌ను పరామర్శించారు.

బాధిత కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందజేత

ముప్కాల్, జూన్15: మండలంలోని వెంచిర్యాల్ గ్రామానికి చెందిన నడ్పికిషన్ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ ముత్యాల సునీల్‌కుమార్ సీఎం సహాయ నిధి నుంచి రూ.2లక్షల 50వేల ఎల్‌ఓసీని నడ్పి కిషన్ కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఎల్‌వోసీ మంజూరు చేయించిన ముత్యాల సునీల్‌కుమార్‌కు బాధిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

చికెన్ ధరలు



రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.150	రూ.280	రూ. 300
వెన్‌కాబ్(కిలో)	: రూ.155	రూ.285	రూ. 305



బంగారం ధరలు



బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.72,800	రూ.67,200	రూ.915

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : హరోం హర (10.45, 7.25, 10.40)
: ఇన్‌సైడ్ ఔట్-2 (ఇంగ్లీష్ 3డి) (2.00)
: మహారాజ (4.20)

స్క్రీన్-2 : ఇన్‌సాడ్ ఔట్-2 (ఇంగ్లీష్ 3డి) (11.25, 5.00)
: మనమే (1.45, 7.20, 10.35)

స్క్రీన్-3 : మహారాజ (10.45, 10.40)
: మ్యూజిక్ షాప్ మూర్తి (1.50)
: హరోం హర (4.40)
: నీదారే నీకథ (7.55)

స్క్రీన్-4 : చందు ఛాంపియన్ (హిందీ) (10.15, 1.25, 7.20, 10.30)
: ముంజియా (హిందీ) (4.35)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : మనమే (10.50, 1.45, 4.40, 7.35, 10.30)

స్క్రీన్-2 : హరోం హర (1.40, 7.30, 10.30)
: నీదారే నీకథ (4.45)

స్క్రీన్-3 : మహారాజ (10.40, 1.45, 4.45, 7.40, 10.40)

దేవి : మహారాజ (11.15, 2.15, 6.15, 9.15)

నటరాజ్ : చందు చాంపియన్ (11.15, 2.15, 6.15,9.15)

విజయ్ : హరోంహర (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్